# "నేను కేవలం ఒక నౌకర్ని"

నౌకరు నాగన్న హృదయారాటం, కమల స్వార్థం, రామారావు అమాయకత, శాయి సంబరం యీ చిన్నకథలో బహుసొంపుగా చిత్రింపబడ్డాయి—

రచయిత:

## జనస్వామి కోదండరామశాస్త్రి.

కమల చేతుల్లోని చంటిబిడ్డ అమితోత్సాహంతో, జిలిబిలి నవ్వులతో, గులాబీరేకుల్లాటి ఆ చిన్ని హస్తాలనుజాస్తూ, ఆ ఎఱ్ఱని లేత పెదవులను భోసొంపుగా కదిలిస్తో నౌకరి నాగన్నవైపుకు దూకుటారంభించాడు. 'అరె... అప్పుడే... అప్పుడే' అని పకపకా నవ్వుతో వెనక్కులాక్కుంటోన్న తనతల్లిని వాడేమీ లక్ష్యపెట్టుటలేదు.

ఎంత కఠిన హృదయాన్నయినా చంటిబిడ్డ జిలిబిలినవ్వులు కొంచెంసేపు స్వర్గానందపు సప్తమపాథంలో పూరేగిస్తాయి. యుగయుగాలుగా ఈ మానవ సంఘర్షణలనూ, అనూయల్నీ, భరిస్తోన్న భూదేవికి వెక్కిరింపులా అన్నట్లుంటాయి. నాగన్నలో ఏమూలనుంచో వాత్సల్య వాహిని పొంగి పొర్లి వాని హృదయస్థానమును తాకింది. ఆజిలిబిలి నవ్వులు వాని మేధస్సులో ముద్రాంకితములయినాయి. ఆబాలానందపు మల్లె సౌరభం మరుద్దామన్నా మరపుకు రాదేమో!

జీవితంలో అంతవరకూ చవిజూచియుండని నూత్నానందంతో వాని శరీరం తూలిపోతోండగా ... కండ్లనుంచి ఆనందభాష్పములు వర్షిస్తోండగా... ఆ సుఖానుభవంలో మునిగి తేలుతూ తనను తానే తెలిసికోలేని పరిస్థితిలో... నాగన్న హస్తములు...గబగబా పురకలు వేస్తో అంతకంతకు ముందుకు సాగివస్తోన్న ఆ చిన్ని చేతులవైపుకు దుమికినాయి.

ఆహ్వానం అందినవెంటనే ఆపసిబిడ్డ నాగన్నచేతుల్లోకి వురికాడు. తనవక్షానికి గట్టిగా అదుముకుని నవ్వుతూ చంకలో యిరికించుకున్నాడునాగన్న. పసిబిడ్డ, తల్లివంక ఆనందంగా, గర్వంగా, చూచాడు.

డక్కులో రికార్డు సర్దుకోవడం పూర్తి అయినతర్వాత, సిజర్ సిగిరెట్ వెలిగిస్తో నాగన్నవైపుకు తిరిగి 'ఏమోయ్! మాట్లాడవేం! జీతం ఎంత యిమ్మంటావ్?' అని అడిగాడు.

కమల వెంటనే అందుకుని అన్నది చిరునవ్వుతో 'మన శాయికిగూడానచ్చాడండోయ్' అని.

నౌకర్లకది చాలా గిరాకీసమయం. చాలామంది వరికోతలకు వెళ్లారు. ఒక్క నాగన్నే ఖాళీగావున్నాడు. ఇంజినీర్ కబురుచెప్పగానే, మాసానికి పదిరూపాయలకు తక్కువ అడక్కూడదనుకున్నాడు. ఓ అయిదునిముసముల క్రితము వరకూ అదే నిశ్చయంతో ఉన్నాడు.

కాని ఆ పసిబిడ్డను చూచేసరికి... తనకు తానై లభిస్తోన్న ఆసుందర అమృతపాత్రను ఎట్లు కాలదన్నగలడు...ముష్టి వెండి రూపాయలకోసరం.

'మీదయ బాబూ......' అన్నాడు నాగన్న తనముఖంపై గులాబీరేకులవలె పాకుతోన్న ఆలేత హస్తాల్ని తీసి ముద్దాడుకుంటూ.

'సరే! ఆరురూపాయలకు కుదురు.'

నాగన్న తలవూపుతూ అంగీకారాన్ని తెలిపాడు.

* * *

ఇంజినీర్ రామారావుగారింట్లో నాగన్న నౌకరికి కుదిరి నాలుగుమాసములైనది. ఇంజినీర్ తొలిబిడ్డ పదిమాసముల వయస్సుగల శాయిని ఎత్తుకోవడమూ, వానిని బుజ్జగిస్తూ, ఆడిస్తోండడమూ నాగన్నపని.

ఆ నవదంపతుల ప్రణయతోటలో పండిన మధురఫలం ముద్దులబిడ్డ శాయి. రెండు లలితవాహినులు రాముకుని పొంగి పొరలినపుడు చీలిన సెలయేటి కాల్వ ఆసుందరవిగ్రహం. ఆ తల్లితండ్రుల ప్రణయజీవితం ధన్యమైందనడానికి స్థిరమైన ఆనవాలు !!!

దుష్టవాయువులతో మిళితమైన యీ ప్రపంచస్పరిశ తన సహజస్వరూపంతో, ఆపసి హృదయంలోకి తొంగిచూడలేదు ఇప్పటివరకూ, ఇంకా ఆ స్వర్గసీమల రసానుభవాన్నే స్మరించుకుంటూ అప్పుడుతప్ప యికముందు లభించని ఆ తలపుల సువాసనల్లో తన్మయుమై సంతోషజలధిలో యీదుతో నేవున్నదేమో ఆ అంతరాత్మ.

'ఏమిరోయ్ మీ వెధవ ప్రపంచం' అన్నట్లు అమిత నిర్లక్ష్యాన్ని సూచించే జిలిబిలి చిరునవ్వులు ...... ఆకాశం నుంచి పొరబాటున వూడిపడిన బాలభాను కిరణమా అనిపించే... కాంతులీనే ఆనున్నని కోమలముఖంలో తొణికిసలాడుతోన్న... బ్రహ్మవర్చస్సు ... మహాతపస్వి ముఖమండలమందలి పవిత్రజ్యోత్స్న...శాంతిదేవత చిరుతర హస్తాలలో వూగుతూ మైమరచి ఆనందిస్తో ఆ బుల్లి హృదయం. ఈప్రపంచం ఏమన్నా అయిపోనీ...కొండలు విరిగిపోనీ...వారధులు పొర్లిపోనీ...అగ్ని వర్షాలలో మాడిపోనీ...దశదిశాంతరములు అదిరిపోనీ... ప్రళయాగ్నిలో కాలిపోనీ... నాకేం? నేను శాంతిగీతాలను పాడుకుంటాను...అన్నట్లు నిర్లక్ష్యంగా... ధీమాగా...వికసించిన మల్లెపూవుల్లాటి ఆ విశాల నేత్రాల్లో చిలుకుతోన్న... అమాయకత ... వేరే లోకాలతో సంబంధాన్ని సూచించే ఆ 'అమాయకత్వం .........అదే మానవునికి పరలోకభిక్ష. వయసు పెరిగినకొద్దీ మానవహృదయంలోకి అసూయా, అహంభావం... స్వార్థం, కోపం ఇవన్నీ చేరి దాన్ని శిథిలపరుస్తాయి.

రోజూ పగలు అడపాదడపా, పాలకు ఏ అరగంటో తల్లిదగ్గఱతప్ప మిగతా అప్పుడంతా నాగన్న చంకలో నే వుండేవాడు శాయి. అథవా, కొంచెంసేపు ఆలస్యమైనదంటే, ఎవరో కొట్టినట్లు పెనపెట్టున ఏడుపూ.

నాగన్న చంకలోకి తీసుకోగానే అంత ఏడుపూ ఒక్కపట్టున మానేసి, ఒక సామ్రాజ్యాధిపతి అయినట్లు కులుకుతూ, అదోవిధమైన హోదాతో... తల్లివంక చూస్తూ మునిముసి నవ్వులు చిమ్మేవాడు. ఆ ఎత్తుకున్నంతసేపూ నాగన్నకూడా ఒకపసిబిడ్డయై శాయితో ఆడుకునేవాడు. వాడు నవ్వినట్లు నవ్వేవాడు. భాషలేని ఆచంటిబిడ్డ అవసరాలను వాని ముఖభావములనుబట్టి తెల్సుకునేవాడు. ముద్దులొలికే ఆచిన్ని నేత్రాలు, చూపులతో ఏమిటేమిటో మాట్లాడేవి నాగన్న హృదయంతో.

తల్లిదగ్గఱ వుండి ఎంత గుక్కపెడుతున్నాసరే 'నాగన్నా'అని పిలవగానే ఏడుపు తగ్గించి సంతోషంగా నల్లగ్రుడ్లను ప్రక్కలకు త్రిప్పుతూ అటువైపు చూచేవాడు శాయి.

నిజంగా నాగన్నవస్తే, ఎత్తుకోమన్నట్లుగా, కాళ్ళూ చేతులూ నేలకేసి కొట్టేవాడు.

శాయి ఏడుపు వినిపించగానే, నాగన్నకు శరీరమంతా మంటలు పుట్టినట్లయ్యేది, వెంటనే గబగబా ఆదుర్దాగా వచ్చి శాయిని చేతిలోకి తీసుకుని బుజ్జగించి మరుక్షణంలో నవ్వించేవాడు.

ఆపసివాడి బోసినోటి నవ్వుల కిలకిలలు నవ వసంత పిక శాబకకలరుతాలకు ప్రతిబింబంలా అనిపించేవి. ఆకాళ్ల చేతుల కదలికలు, గాలితఱగలకు చిరుగంతులువేసే తమ్మిరేకులను స్ఫురణకు తెచ్చేవి నాగన్నకు ........ ఆ 'ఊఁ... ఆఁ...లలో ఏవేవో విపంచి స్వరాలుధ్వనిస్తోన్నట్లుగాతోచేదివానికి.

రాత్రిసమయాల్న నాగన్న, ఒంటరిగా తన నిట్టాడి గుడిసెలో పడుకుని చిన్నబాబుని యీకాసేపుకూడా నాదగ్గఱ వుండనీయకూడదూ?' అని అనుకునేవాడు. ఒక్కొక్కరాత్రి అసలు వాడికి నిద్రవుండేదేకాదు. 'చిన్నబాబూ, చిన్నబాబూ?' అని స్మరించుకుంటూ, ఇల్లంతా తిరుగుతూ, ఏ తెల్లవార్జామున నాలుగుగంటలకో, కోడికూత వినిపించినాక, తన అవివేకాన్ని గుర్తించి కొంచెం విచారపడుతూ 'ఆఁ, వ్యర్థమేకాని. నాదేముంది? 'నేను కేవలం ఒక నౌకరిని' అని అనుకుంటూ సగం శిథిలమైపోయిన నులక కుక్కిలో నడుము వాల్చేవాడు.

* * *

శాయి వయస్సు నాలుగు వసంతాల్ని గడిపింది.

నాగన్నలోని వాత్సల్యం ఇప్పుడు ఒక ఆకారాన్ని పొందింది. వాని జీవితంలో శాయి ఒక అంతర్భాగమైపోయాడు. నాగన్న, సాయంత్రసమయాల్లో కొంచెం చల్లపడగానే శాయిని పూలతోటల్లోకీ,కొండ లోయల్ని తొలుచుకుని పొంగి వస్తోన్న సెలయేటివద్దకూ, పెరిగివున్న వరిపొలాలలోకీ తీసుకుని వెళ్ళేవాడు. ఆమనోహర ప్రకృతి దృశ్యాల్నిగురించి చక్కని భాషలో శాయి బాల్యహృదయానికి అతుక్కునిపోయే లాగు కథలు చెపుతూండేవాడు.

సాయంత్రం నాలుగయ్యేసరికి ఇస్త్రీ దుస్తులుధరించి, ఆచిన్ని క్రాఫింగ్ జుత్తును సరిదిద్దుకుని, కనుబొమ్మలమధ్యకు కొంచెంపైగా చక్కగా నుక్క-

పెట్టుకుని.... వరండాలో నాగన్న కోసరం ఎదురుచూస్తో కూర్చోవడం... నాగన్నరాగానే వానివెంటవెళ్ళి పోవడమూ... ఇక తల్లి ఎంతపిల్చినా అంతే? తండ్రి ఎంతపిల్చినా అంతే?

కమలకు తిరిగి సంతానంలేదు. శాయి వల్ల తాను పొందాల్సిన ఒక అమూల్యమైన ఆనందాన్ని నాగన్న కాజేస్తోన్నాడని అనుకుంది కమల అసూయతో, అమితకోపంతో, ఆమె హృదయం వూగిపోయింది. యీనాగన్న పీడ విరగడైపోవడానికి వెంటనే వుపాయం కనిపెట్టగలిగింది.

స్త్రీబుద్ధిః ప్రళయాంతకః అని పూరికే అన్నారా.

మర్నాటిరాత్రి భర్త క్యాంపునుంచి వచ్చాడు. భోజనం చేస్తోండగా, మాటామాటా సందర్భంలో కమల యీవిషయాన్ని మహాసొంపైన పద్ధతి కదల్చింది.

'చూశారా మన శాయిసంగతి? అసలు యిల్లుపట్టడంలేదు నౌకరి నాగన్నతో ఎక్కడికో పోతున్నాడు దినం. ఇల్లా అయితే పిల్లవాడు చెడిపోతాడని చాలామంది అంటున్నారు. నౌకరీ వెధవలు కొంచెం వున్నవాళ్ళ పిల్లల్ని మచ్చిక చేసుకుని పెద్దయినతర్వాత మంచి ఒదిలిపెడతారట. అట్లా అనేకచోట్ల జరిగిందట.... ఇక మనింట్లో నౌకరి మానెయ్యమని చెప్పండి.'

'ఆఁ. పాపం. వాడుచాలా మంచివాడు. మానెయ్యమనడం ఎందుకులే.'

'బాగానేవుంది.'

ఇంతలో శాయి ఏదో వెర్రి ఆనందంతో గంతులువేస్తో లోపలకు పరుగెత్తుకుని వచ్చాడు.

'బాబూ యింత ప్రొద్దుపోయినదాకా ఎక్కడకు వెళ్లావ్?' అని అడిగాడు రామారావు.

'నేనే.. నేను... నేనూ, నాగన్నా కొండ ఎక్కాం నాన్నగారు.'

'చూశారా ఆతీరు? నాలుగేళ్ళ పిల్లవాడిని కొండలమీదకు తీసుకెళ్ళడం ఎందుకు చెప్పండీ? అక్కడ కూర్చోపెట్టి 'అమ్మమాట వినొద్దు. నాన్నమాట వినొద్దు. వాళ్లు చూడాకుండా ఇంట్లోనుంచి డబ్బులు తీసుకునిరా' అని యిటువంటిమాటలు చెప్పడమూ?'

'ఆఁ.. ఆఁ.... నాగన్న అట్లా చెప్పడంలేదే అమ్మా......'

'నోరుముయ్. వెధవా. పైగావాడు చెప్పినట్లల్లా చేస్తో.....' అని గర్జించింది కమల ఆమె తత్వం కనుక్కోలేక తల్లడపడుతున్నాడు రామారావు. భోజనం పూర్తిచేసుకుని చికాకుపడుతూ వరండాలోకి వెళ్ళాడు. నాగన్న అక్కడే కూర్చొని వున్నాడు. జీతం లెక్కచూచి పదిరూపాయల కాగితం వానిపైకి విసురుతూ 'నాగన్నా? మాకు ఇక నౌకరు అనవసరమోయ్. శాయి కొంచెం పెద్దవాడైనాడుకదా? యింకెందుకులే. రేపటినుంచీ మానెయ్యి' అని అన్నాడు ఇంజినీర్. నాగన్నకు మీద పిడుగుపడినట్లయింది. గద్గద కంఠస్వరంతో 'బాబూ?.. ఇకనుంచీ జీతంఒద్దులెండి. చిన్నబాబుకు సేవచేస్తూవుంటాను.' అన్నాడు నాగన్న. రామారావు మనసులో కమల నాటిన విషబీజాలు మొలకలెత్తినాయి. నాగన్న హృదయవేదన రామారావు కనిపెట్టలేకపోయాడు. జీతంకూడా అక్కర్లేకుండా శాయికి సేవచేస్తాననడంలో




టి. సి. యెక్.

ఆభరణాలంకారపుటందాన్ని తెలుపడానికి అద్దమేల?

మెడ చెయినులు

2 సంవత్సరములు గ్యారంటీ. కాంతిలోను, వన్నెలోను బంగారుచెయినుల కేమాత్రము తీసిపోవు. వలు పెక్కువు,

| పెద్ద సైజు | | చిన్న సైజు | |
|---|---|---|---|
| 1 పేట 1-కి రూ. | 7-0-0 | 1 పేట 1-కి రూ. | 5-0-0 |
| 2 పేటలు ,, | 14-0-0 | 2 పేటలు ,, | 10-0-0 |
| 3 పేటలు ,, | 21-0-0 | వి. పి. ఖర్చులు | 0-8-0 |
| 4 పేటలు ,, | 28-0-0 | | |

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు 'ఆంధ్రభూమి' పేరు నుదహరించిన మాధరలమీద రూపాయకు ఒక అణా వంతున తగ్గించబడును.

టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్‌టాక్సురోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంట్సు:—గుప్తా అండ్ కో, మెయిన్‌రోడ్, కాకినాడ.

నాగన్న కేదో స్వార్థం వుండితీరాలనుకున్నాడతను.

'పిల్లేదు. నాగన్నా.' అన్నాడు కటువుగా.

నాగన్నకళ్ళల్లో గిర్రున నీళ్లుతిరిగాయి......నాగన్న గుమ్మందాటి వెళ్ళిపోతోండగా, దొడ్డివాకిట్లోనుంచి పరువెత్తుకుంటూ వచ్చాడు శాయి.

'నాగన్నా? ఎక్కడికి? వెళుతున్నావ్? ఇంటికా?'

'ఆఁ.....అవు..కా..కాదు...ఇక రేపటినుంచీ రాను చిన్నబాబూ....'

'ఏం నాగన్నా?' దిగాలుపడి చూస్తో.

'నాన్నగారు ఒద్దన్నారు.'

వెనకవైపునుంచి వీస్తోన్న శీతలవాయువులు శాయివీపున అనుకుని లోపలకు దించుకుని పోతోన్నాయి.

'నాగన్నా?... మళ్ళీ... మళ్ళీనే... ఎవరింట్లోన్నా నౌకరీకి కుదరరాదూ.....'

'పిల్లల్ని ఎత్తుకునే నౌకరీ దొరక్కపోదుగాని బాబూ, నీలాంటి...చిన్న అబ్బాయి...నా జీవితంలో యికముందెన్నడు లభించదు చిన్నబాబూ....' నాగన్న నేత్రములనుండి నీటిబొట్లు జలజలమని రాలినై క్రిందకు.

ఆలా ఏడుస్తావేం నాగన్నా?

'ఆఁ నాదేముందీ? నేను కేవలం ఒక నౌకర్ని.' అని అనుకుంటూ, ముడిపడిదట్టముగా ప్రబలివున్న అనంతనిశీథ నిశ్శబ్ద శర్వరీకుంతలములలో పాపడిగీత దిద్దుతూ, ఆమార్గాన్నే వడివడిగా నడిచిపోతున్నాడు అనిరాశా హృదయుడు ఎక్కడికో?

# ప్రశ్నోత్తరము

"తలదాచుకొనుటకుఁ దావులే దెచట
నడచపోయెద వీయనంత మార్గమున
ఎందుండి వచ్చితి వెందుఁబోయెదవు
ఓయి నిరాశ్రయా! ఓ నిరాధార?"

"సకల చరాచర ప్రకట నాటకముఁ
జదువఁగాజాలు రసజ్ఞ పండితుల
నడుగుమా, విషయ సంశయారూఢ చిత్త!
పనికి మాలిన వేయి ప్రశ్నలేమిటికి?
"జలజల ప్రవహించు జాహ్నవీ- పుణ్య
వీచికా గానము వినువారి నడుగు;
భవనాట్యశాలలోఁ బాత్రాభినయముఁ
గావించి తెరచాటుగానున్నవారి;
గంపెడాశలు నీట గల్పినవారి,
భాష్ప స్రవంతిలోఁబడి మున్గువారి,
నడుగుమా, ప్రాంజలివై శూన్యహృదయ!"

"మర్త్య సంస్పర్శ సన్మధువాసరముల
వనలక్ష్మి పులకింపఁ బ్రణయగీతములు
గొంతెత్తిపాడు కోయిల నడుగు
మధిక ప్రసంగ భాగ్యము మాకులేదు"
"మూఁగలై జగములు మునిగిపోయినవి,
వినివిని యుగములు విసిగిపోయినవి;
యేమి ప్రయోజన మీ ప్రశ్నలందు?
అడుగుమా, జన్మాంధ! ఆత్మయేమనునో!"

"అఖిల లోకావళి కాధార మెవఁడు,
అనిరాధారు నే నాశ్రయించెదను,
ఇల్లువాకిలి లేక యిందందుఁ దిరిగి
తిరిగిపోయెద సుమీ, చిరధామమునకు
నీలోన నాలోన నిత్యమై వెలుఁగు
సత్య పదార్థమే శరణంబు మనకు!"

—చిత్రాపూరి కామేశ్వర రావు, బిఏ, యల్‌టి, బి.యుల్.